ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 29 జూన్ 2024





జిల్లా అభివృద్ధికి కృషి

కలెక్టర్‌గా నాగరాణి బాధ్యతలు

భీమవరం టౌన్, జూన్ 28 : పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 1-30 కు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు జిల్లా జాయింటు కలెక్టరు సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్లోకి ప్రవేశించి బాధ్యతలు చేప ట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన నడిపి స్తానని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు తీసుకువెళతామని అన్నారు. జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సహకరించాలని కోరారు. కలెక్టరేటు పరిపాలన అధికారి పి.పాపారావు, భీమవరం, నరసాపురం ఆర్డీవోలు కె.శ్రీనివాసులురాజు, అచ్యుత అంబరీష్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సెక్షన్స్ సూపరింటెండెండ్లు, ఉద్యోగులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలను అందించి అభినందనలు తెలిపారు.

డయేరియా అదుపునకు కమాండ్ కంట్రోల్ టీంలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మహేశ్వరరావు



భీమవరం టౌన్, జూన్ 28 : జిల్లాలో డయేరియా వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకు న్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహే శ్వరరావు తెలిపారు. జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ టీం ఏర్పాటు చేశామని ఈ కంట్రోల్ టీం 24 గంటలు అందుబాటులో వుంటుంద న్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు వారి పరిధిలో డయేరియా కేసులు నమోదైతే వెంటనే కమాండ్ కంట్రోల్ టీంకు తెలియ పరచాలని ఈ విషయం పట్ల నిర్లక్ష్యం వహించినట్లయితే శాఖాపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ దేవ సుధాలక్ష్మి ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా అనే కార్య క్రమాన్ని జూలై 1 నుంచి ఆగస్టు 30వరకు రెండు నెలల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆహార పదా ర్థాలు వేడిగా తినాలని, మూతలు వుంచిన ఆహార పదా ర్థాలను మాత్రమే తీసుకోవాలని తెలిపారు. అన్ని ప్రాథ మిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, జింక్ మాత్రలు, సిరప్‌లు, మందులు సిద్ధంగా ఉంచామన్నారు.

త్రిసభ్య కమిటీలకు చెల్లుచీటీ



సొసైటీల్లో ఆఫీస్ ఇన్‌ఛార్జ్‌లు నియామకం
ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
జిల్లా సహకార అధికారులకు బాధ్యతలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలపై వేటు పడింది. వారి స్థానంలో ఆఫీస్ ఇన్‌ఛార్జ్‌లను నియమించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జిల్లా సహకార అధికారులకు నియామకపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఆదేశాలతో తక్షణమే జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. ఒక్కరోజు వ్యవధిలోనే అధికారులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. దాంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీలకు చెక్ పడింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 259 సహకార సంఘాలున్నాయి. భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో 114 సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు తర్వాత 104 సంఘాలకు చెందిన త్రిసభ్య కమిటీలు రాజీనామా చేశాయి. నరసాపురం పరిధిలోని కమిటీలు రాజీనామా చేయలేదు. ప్రభుత్వ ఉత్తర్వులతో సంబంధిత కమిటీలు కూడా రద్దయ్యాయి. వాటి స్థానంలో ఇన్‌ఛార్జ్‌లు నియమితులయ్యారు.

వైసీపీలో ఇష్టారాజ్యం

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలపై వైసీపీ పెత్తనం పెరిగింది. రైతులకు పరపతి తగ్గింది. ఎన్నికలు నిర్వహించకుండా ఐదేళ్లు గడిపారు. వైసీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్‌లు సిఫారసులతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి త్రిసభ్య కమిటీలను నియమిస్తూ వచ్చారు. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు పెద్దపీట వేశారు. గడచిన ఐదేళ్లలో సహకార సంఘాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వ సహకారం కొరవడింది. ధాన్యం కమీషన్ సొమ్ములు కూడా ఇవ్వలేదు. జిల్లా సహకార బ్యాంకుల్లో కమీషన్‌ను డిపాజిట్ చేశారు. దానికి వడ్డీని సహకార సంఘాలకు అందిస్తూ వచ్చారు. ఒక పర్యాయంలో రైతులకు ఇచ్చిన రవాణా చార్జీలు కూడా సొసైటీలకు విడుదల చేశారు. ఆ సొమ్మంతా రైతు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా వైసీపీ నియోజకవర్గ నేతలతో పాటు, త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌లు తినేశారు. రైతులకు ఇవ్వలేదు. తర్వాత ప్రభుత్వం కమీషన్ ఎవ్వరికీ విడుదల చేయలేదు. జిల్లాలో దాదాపు రూ.100 కోట్లు మేర బకాయి పడింది. వైసీపీ నేతలు చెప్పినట్టుగానే సొసైటీలు నడిచాయి తప్ప రైతులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. సమస్యలపై ప్రభుత్వాన్ని పశ్నించే పరిస్థితి లేకుండా పోయింది.తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీ హయాంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీలకు చెక్ పడింది. రాజీనామాలు చేశారు. రాజీనామా చేయని వారిపై ప్రభుత్వం వేటు వేసింది.

ఎన్నికలా ? కమిటీలా ?

వైసీపీ త్రిసభ్య కమిటీలను తక్షణమే రద్దు చేసేందుకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగింది.ఆఫీస్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. దాంతో అధికారికంగా త్రిసభ్య కమిటీలు రద్దయ్యాయి. భవిష్యత్తులో ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుందా లేదంటే కొన్ని రోజుల వరకు మళ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తుందా అనే అంశంపై చర్చ నడుస్తోంది. ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందనే దానిపై సహకార సిబ్బంది ఆసక్తిగా గమనిస్తున్నారు. కూటమి శ్రేణులు కూడా తమకూ నామినేటెడ్ ద్వారా అవకాశం ఇవ్వాలని ఆశిస్తున్నారు. కొద్ది రోజులపాటైనా కమిటీలతోనే ముందుకు వెళ్లాలని అభిప్రాయంతో కూటమి శ్రేణులున్నాయి.

వెంకన్నకు శఠగోపం

ముగ్గురు వ్యక్తులు సిండికేట్
తక్కువ కౌలుకే భూముల లీజు
ఎకరానికి రూ.12 వేలు
ఎవరికీ తెలియకుండా పాట

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



తిరుమల తిరుపతి దేవస్థానానికి పెంటపాడు మండలం పరిమళ్లలో దాదాపు 15 ఎకరాల భూమి ఉంది. అక్కడ ముగ్గురు వ్యక్తులు సిండికేట్ అయ్యారు. తక్కువ మొత్తానికి కౌలుకు తీసుకున్నారు. ఎకరానికి 12 బస్తాల చొప్పున వేలంపాటలో ఏడాది సాగుకు భూమిని దక్కించు కున్నారు. పాట విషయం గ్రామంలో ఎవరికీ తెలియదు. గడచిన మూడేళ్లుగా అదే వ్యక్తులు పాడుకుంటున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని ఇప్పటిదాకా సాగు చేస్తూ వచ్చారు.ఈ ఏడాది కూడా గ్రామస్థులను ఏమార్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఎస్టేట్ అధికారి హోదాతో ఉన్న నోటీస్‌ను పంచాయతీకి ఇచ్చారు. నోటీస్‌లో పెట్టమన్నారు. మూడు రోజుల క్రితం నోటీసు బోర్డులో పెట్టారు. ఈ విషయం తిరుమల తిరుపతి దేవస్థానం సిబ్బంది గ్రామంలో ప్రకటన చేయాలి. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న భూములకు మాత్రం ఆ శాఖ సిబ్బంది గ్రామంలో టాంటాం వేసి ప్రకటన చేస్తారు. టీటీడీ భూముల విషయంలో అలా జరగలేదు. పంచాయతీ నోటీస్ బోర్డులో పెట్టిన విషయం కూడా ఎవరికీ తెలియదు. గ్రామంలో సచివాలయం వద్ద శుక్రవారం పాట నిర్వహించారు. గతంలో సాగు చేసిన ముగ్గురు రైతులు మాత్రం హాజరయ్యారు. వేలం పాటను సర్పంచ్ వ్యతిరేకిం చారు. వాయిదా వేయాలని కోరారు. ఇలా రెండు గంటలపాటు పాట నిలిచిపోయింది. ఆ తర్వాత పాట పెట్టారు. గతంలో సాగు చేసిన వ్యక్తులే దక్కించు కున్నారు. ఏడాదికి 12 బస్తాల వంతున లీజు ఖరారు చేశారు. వాస్తవానికి పరిమళ్ల గ్రామంలో ఎకరానికి ఏడాది కౌలు 40 బస్తాల వరకు ఉంది. దేవస్థానం భూములు అయితే కనీసం 35 బస్తాలకు వెళ్లాలి. అంటే పాట ద్వారా ఎకరానికి 23 బస్తాలు కోల్పోయారు. కేవలం ముగ్గురు వ్యక్తులు సిండికేట్ అయి పాట దక్కించుకున్నారు. తక్కువ మొత్తానికి కౌలు ఇచ్చేలా విజయవంతమయ్యారు. టీటీడీకి మాత్రం నష్టం వాటిల్లింది. దీనిపై కూటమి నాయకులు దృష్టి పెట్టారు. గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

ఖరీఫ్ నాట్లు పూర్తిచేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం రూరల్, జూన్ 28 : జిల్లాలో వరి నాట్లు పూర్తిచేసి, నవంబరు నెలలో తుఫాన్లు బారిన పడకుండా జాగ్రత్త పడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య రైతులను కోరారు. శుక్రవారం వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్‌లో ఖరీఫ్ సాగు సన్నద్ధతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో తుఫాన్‌లు ఏర్పడే అవకాశం ఉంటుందని ఆ సమయంలో పంట నష్టపోకుండా త్వరితగతిన ఊడ్పులు పూర్తి చేసి, సకాలంలో పంట కోతలను పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు ఈ విషయమై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 96,925 సాగు భూమి ఉండగా ఖరీఫ్‌లో 86,831 హెక్టార్లు వరి సాగు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అత్యధికంగా తాడేపల్లిగూడెం మండలంలో 10,224 హెక్టార్లు, అత్యల్పంగా మొగల్తూరు మండలంలో 333 హెక్టార్లలో వరి సాగు జరుగుతుందన్నారు. జిల్లాకు 48,463 క్వింటాళ్ళు విత్తనాలు అవసరం కాగా 85 క్వింటాళ్ళు విత్తనాలను కేజీ ఐదు రూపాయల చొప్పున సబ్సిడీపై అందజేశామన్నారు. 43,585 క్వింటాళ్ల విత్తనాలను రైతులు స్వయంగా సమకూర్చుకోగా 4,598 క్వింటాళ్ల విత్తనాలు ప్రైవేటు డీలర్ల ద్వారా సరఫరా జరిగినట్లు తెలిపారు. ఎంటీయు 1318, 7029, 1061, 1064, స్పందన స్వర్ణ, పీఆర్ 126 వెరైటీ విత్తనాలను జిల్లాలో ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 20 మండలాలకు 58,905 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం కాగా 21,272 మెట్రిక్ టన్నుల యూరియా, 23,464 కాంప్లెక్స్, 2,391 డీఏపీ, 6,391 ఎస్ఎస్‌పి, 5,387 మెట్రిక్ టన్నుల ఎంవోపీ అవసరం ఉందన్నారు. జిల్లాలో నేటివరకు 46,144 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు రూ.4,179 కోట్లు పంట రుణాలు, రూ.3116 కోట్లు టర్మ్ లోన్స్ అందజేస్తామన్నారు.సాగునీటికి ఇబ్బంది లేని విధంగా అవసరమైన డ్రైన్లు పూడికతీత, కిక్కిస తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.



గునుపూడి వద్ద ఆకుమడుల నుంచి నీరు తోడుతున్న రైతులు

ముంపులో నారుమడులు

భీమవరం రూరల్, జూన్ 28 : వర్షాలతో సార్వా నారుమడులతో పాటు పంట భూములు మురుగు కాలువలు నిండాయి. రెండు రోజులు పాటు ఎడతెరపిలేని వర్షంతో జిల్లాలో 1500 ఎకరాల నారుమడులలో 30 శాతం నారుమడులు పూర్తిగా మునిగాయి. మిగిలిన 70 శాతం నారుమడులు ముంపు అంచున ఉన్నాయి. శుక్రవారం ఉదయం నాటికి 235 మి.మీ వర్షపాతం పడటంతో మురుగుకాలువల వర్షపునీటితో పయనిస్తున్నాయి. పంట భూములు కూడా చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువలు చెత్తతో ఉండటం వల్ల పంట చేలల్లో నీరు బయటకు వెళ్ళడం లేదు. ఇలా అయితే ఇంకా నారుమడులు వేయాల్సిన ప్రాంతాల్లో వారం రోజులు వరకు నారుమడులు వేసేందుకు వీలుకాదని రైతులు లెక్కవేస్తున్నారు. సార్వా సాగు ముందుకు సాగాలంటే మురుగు కాల్వల ప్రక్షాళన ముందు చేయాల్సిందేగా కనిపిస్తోంది.



మహిళా వార్డుల్లో అందిస్తున్న సేవలను తెలుసుకుంటున్న ఆరిమిల్లి

వైద్య సేవలెలా ఉన్నాయ్ ?

రోగులను ఆరా తీసిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూన్ 28 : "అమ్మా.. వైద్యం చేయించుకున్నారా ? సేవలెలా అందుతున్నాయి.. సౌకర్యాలు బాగున్నాయా ? ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా" అంటూ రోగులను పలకరిస్తూ ఆసుపత్రి పరిస్థితి తెలుసుకున్నారు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ. శుక్రవారం ఆయన జిల్లా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. దాతలు ఇచ్చిన మినరల్ వాటర్ ప్లాంటు వినియోగంలో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ప్రసూతి విభాగం, చిన్న పిల్లల వార్డులను పరిశీలించారు. మహిళా వార్డులో అందించే సేవలను పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్‌కు ఇబ్బంది పడుతున్నామని పలువురు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు. రోగులకు ఉచితంగా అన్నదానం అందించే సత్యసాయి అన్న ప్రసాద భవనాన్ని పరిశీలించారు. వైద్యులు, మందులు, సిబ్బంది, అవసరమైన వాటి కోసం నివేదిక తయారు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకు చెప్పారు. ఆయన మాట్లాడుతూ '2019 తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సీఎం చంద్రబాబు ఏరియా ఆసుపత్రి నుంచి జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క బిల్డింగ్ కట్టలేదు. కనీస సౌకర్యాలు కల్పించలేదు. రానున్న రోజుల్లో ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి కమిటీ వేసి ఉత్తమ ఆసుపత్రిగా తీర్చిదిద్దుదాం' అని వివరించారు. టీడీపీ నాయకులు మల్లిన రాధాకృష్ణ, సప్పా రాజు, వల్లూరి గంగయ్య, సూరా సాహెబ్, సైకాలజిస్టు డాక్టర్ సాయి బాలాజీ, పలువురు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు

భీమవరం కార్పొరేషన్ కావాలి

చర్యలకు ఎమ్మెల్యే అంజిబాబు ఆదేశం



భీమవరం టౌన్, జూన్ 28 : భీమవరం మునిసిపాల్టీని కార్పొరేషన్‌గా చేసేందుకు అధి కారులు చర్యలు తీసుకోవాలని తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) సూచించారు. శుక్రవారం మునిసిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఎందుకు జరగలేదని ప్రశ్నించగా కోర్టులో కేసులు కారణంగా పెండింగ్‌లో పడిందని వివరించారు. గతంలో తప్పుడు గ్రూపుల ద్వారా మునిసిపాల్టీని, బ్యాంకులను మోసగించి రూ.30 లక్షలు తీసుకున్న ముగ్గురు ఆర్పీలపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే మెప్మా అధికారి నానిబాబును ప్రశ్నించారు. కొంత సొమ్ము రికవరీ చేశామని ఇంకా రూ.22 లక్షలు వసూలు చెయ్యవలసి ఉందన్నారు. 3 నెలలు గడువు ఇస్తున్నానని సొమ్ములు రికవరీ చెయ్యాలని లేదంటే వారిపై కేసులు నమోదు చెయ్యాలని ఆదేశించారు. డ్వాక్రా గ్రూపులు రాజకీయాలకు దూరంగా ఉండా లన్నారు. పట్టణంలో రోడ్లపై చెత్తకుప్పలు లేకుండా చూడాలని, చెత్త వాహనాలు వచ్చినప్పుడు వారికి అందించాలని బయట వేస్తే జరిమానాలు విధించండని పారిశుధ్య అధికారులకు సూచించారు. మునిసిపాల్టీకి చెందిన షాపులను పాడుకొన్న ఒక యజమాని 25 లక్షలు మునిసిపాలిటీకి చెల్లించకపోయినా ఎందుకు చర్యలు లేవని రెవెన్యూ ఆఫీసర్ రంగారావును ఎమ్మెల్యే ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చామని చెప్పటంతో నోటీసులతో సరిపెడతారా అని ప్రశ్నించారు.వెంటనే బకాయిలు వసూలు చెయ్యాలని ఆదేశించారు. పట్టణంలో ఎక్కడైనా అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఇకనుంచి తాను పరిశీలించిన తరువాతే చేపడదామని మునిసిపల్ ఇంజనీర్ త్రినాథరావుకు సూచించారు. మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల, కొటికలపూడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు 53,863 దరఖాస్తులు



నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రవేశద్వారం



మాట్లాడుతున్న అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, జూన్ 28 : రాజీవ్‌గాంధీ యూని వర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశాలకు అధికభాగం బాలికల నుంచి దరఖాస్తులు అందాయని ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్జీ యూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఉన్న 4,400 సీట్లకు మొత్తం 53,863 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 19,671 మంది, ఇతర రాష్ట్రాల నుంచి 38 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 30,857 మంది బాలికలు ఉండగా, 23,006 మంది బాలురు ఉన్నారన్నారు. ఇక సైనిక సంతతి విభాగంలో 2,582 మంది, ఎన్‌సీసీలో 1830, స్పోర్ట్స్ విభాగంలో 1162, దివ్యాంగుల విభాగంలో 332, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 270 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

ఒకటి నుంచి అడ్మిషన్ల ప్రక్రియ

జూలై 1వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. సైనిక సంతతికి చెందిన విద్యార్థులకు జూలై 1 నుంచి 3వ తేదీ వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు, దివ్యాంగులకు, స్పోర్ట్స్ విభాగంలోని వారికి జూలై 3వ తేదీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారికి జూలై 2,3 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుదిజాబితా జూలై 11న విడుదల చేస్తారని, నూజివీడు, ఆర్కే వ్యాలీలలో ఆయా క్యాంపస్‌లకు కేటాయించిన విద్యార్థులకు జూలై 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందని, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి జూలై 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి 26,27 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ప్రత్యేక కేటగిరీల్లో పోటాపోటీ

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో 2024 అడ్మిషన్‌లలో తీవ్ర పోటీ నెలకొంది. ఈసారి సాధారణ కేటగిరిలోనే కాక ప్రత్యేక కేటగిరిల్లో సైతం అడ్మిషన్లకు పోటీ నెలకొనడం విశేషం. క్రీడల విభాగంలో 0.5శాతం రిజర్వేషన్ క్రింద మొత్తం నాలుగు క్యాంపస్‌ల మీద 20 సీట్లను కేటాయించగా, 1162 మంది దరఖాస్తు చేశారు. ఒక్కో సీటుకు దాదాపు 58 మంది విద్యార్థులు పోటీ పడు తున్నారు. ఇక సైనిక సంతతి విభాగంలో 40 సీట్లకు 2,587 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఇక్కడ ఒక్కో సీటుకు 64 మంది పోటీ పడుతున్నారు. ఎన్‌సీసీ విభాగంలో 80 సీట్లకు 1,830 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 22.8 మంది పోటీ పడుతుండగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 20 సీట్లకు 270 మంది దరఖాస్తు చేశారు. ఈ విభాగంలోనూ 14 మంది విద్యార్థులు పోటీ పడుతుండగా, ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మాత్రం 200 సీట్లకు 332 మంది దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 1.66 మంది విద్యార్థులు పోటీ ఏర్పడింది. మొత్తం మీద స్పెషల్ కేటగిరీలో ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మినహా మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి తీవ్ర పోటీ నెలకొంది.

కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌కు ఆరు నెలల జైలు

కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు తీర్పు

ఏలూరు టూ టౌన్, జూన్ 28 : ఏలూరు నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్యకు కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు ఆరు నెలల జైలు, రూ.2 వేలు జరిమానా విధించింది. గతంలో ఆయన మచిలీపట్నం మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ సస్పెండ్ అయ్యారు. కొవిడ్ సమయంలో తప్పిదాలకు పాల్పడ్డారని ఏసీబీ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా వెంకటేశ్‌ను డైరెక్టరేట్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ) అధికారులు సస్పెండ్ చేశారు. దీనిపై ఆయన హైకోర్టుకు వెళ్లగా.. సస్పెన్షన్‌ను రద్దు చేసి విధుల్లో చేర్చుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. దీనిపై వెంకటేశ్‌ను విధుల్లో చేర్చుకోవాలని డీఎంఏ అప్పటి మునిసిపల్ కమిషనర్ చంద్రయ్యకు ఉత్తర్వులు ఇచ్చారు. కాని వైసీపీ ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు వెంకటేశ్‌ను విధుల్లోకి చేర్చుకోకపోవడంతో ఆయన మళ్ళీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు ధిక్కరణ కింద చంద్రయ్యకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తీర్పునిచ్చారు.

ఉద్యాన వర్సిటీలో ఏం జరుగుతోంది ?

7



అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజును కలిసిన అంగన్‌వాడీలు, ఎంపీపీ జయలక్ష్మి

ఆకివీడు, జూన్ 28: ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజును అంగన్వాడీలు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి శుక్రవారం కలిసి పుష్ప గుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. అంగన్వాడీ సమస్యలు చాలా ఉన్నాయని గత ప్రభుత్వంలో అమలు చేస్తానని నేటికి చేయలేదని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు తీసుకెళతానన్నారు.

జేసీ ప్రవీణ్ ఆదిత్యతో ఎమ్మెల్యే భేటీ

ఉండి, జూన్ 28:జిల్లా కలెక్టరు ప్రవీణ్‌ఆదిత్యతో ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై చర్చించారు. శుక్రవారం కాళ్ల మండలం పెదఅమిరం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆయన బయలుదేరి వెళ్లి జాయింట్ కలెక్టరును కలసి సమస్యలపై చర్చించినట్లు తెలిసింది.

రైల్వే సమస్యలు పరిష్కరించాలని వినతి

భీమవరం టౌన్, జూన్ 28: రైల్వే సమస్యలపై శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు వినతిపత్రాన్ని అందించారు. జిల్లా నుంచి ఎంతో మంది ప్రయాణికులు నిత్యం రైల్వే వ్యవస్థ పైనే ఆధారపడి ఉన్నారని, ప్రస్తుతం రైళ్ల రద్దుతో ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై రైల్వే అధికారులకు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రాన్ని అందజేశామని, వీటిపై రైల్వే అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి

నరసాపురం, జూన్ 28: నియోజకవర్గ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యమై ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్యే నాయకర్ కోరారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్డీవో అంబరీష్ మాట్లాడుతూ మంచి కార్యక్రమాలు చేసే వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ మేకల సతీశ్, క్లబ్ సభ్యులు సత్యవతి, రాంకుమార్, కృష్ణ, భవాని విజయ, బి.సూర్యకుమారి పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ


విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఈ అనిల్‌కుమారి

నరసాపురం రూరల్, జూన్ 28: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గొడౌన్లలో విత్తనాలు నిల్వ చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి ఆదేశించారు. శుక్రవారం పట్టణ, మండలంలోని రైస్ మిల్లు, విత్తన విక్రయ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, విత్తన రకాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. విత్తన కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. నిబంధనల విరుద్ధంగా అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు జేఏసీ సమావేశం

నరసాపురం రూరల్, జూన్ 28: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జేఏసీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణరావు తెలిపారు. రేవు నిర్వహణదారుడు బకాయి పడిన సొమ్ము, ఏం చర్యలు తీసుకోవాలన్న దానిపై ఈసమావేశంలో ప్రధానంగా చర్చిస్తామన్నారు. ఉదయం 11గంటలకు జరిగే సమావేశంలో డీఎల్‌పీవో, జేఏసీ కమిటీ సభ్యులు పాల్గొంటారన్నారు.



పెన్షనర్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

ఆకివీడు, జూన్ 28:ఆకివీడు యూనిట్ (సబ్-ట్రెజరరీ) పరిధిలోని పెన్షనర్స్ (విశ్రాంతి ఉద్యోగులు) అసోసియేషన్‌తో సంబంధిత జిల్లా ఎలక్షన్ ఆఫీసర్ వీకే వీరారావు, జిల్లా అధ్యక్షుడు డి.హరికుమార్ శుక్రవారం ఇరిగేషన్ బంగ్లాలో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా పి.బలరామ రాజు, కెఎస్ రామకృష్ణంరాజు, సెక్రటరీగా అడవి వెంకట సుబ్బారావు, జాయింట్ సెక్రటరీలు ఎండీ ఉమర్, జంపన రామ చంద్రరాజు, కె.సాంబశివరావు, కోశాధికారిగా సీహెచ్‌వీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎంవీ సత్యనారాయణరాజు, సీహెచ్ అంజనేయులు, వీసీహెచ్ రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమతానగర్‌లో రోడ్లు వేయాలని ధర్నా



ఆకివీడు, జూన్ 28: సమతానగర్ రహదారిలో చిన్నపాటి వర్షానికే నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రోడ్లు వేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. సమతానగర్ రోడ్‌లో నిలిచిన వర్షపు నీటిలో సీపీఎం నాయకులు, స్థానికులు నీటిలో నిలబడి ధర్నాచేసి మాటాడారు. దాదాపు 30 ఏళ్ళుగా ఈ ప్రాంతంలో రోడ్లు వేయలేదని, పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయని, అంతేకాకుండా తాగునీటి సమస్య కూడా అధికంగా ఉందని ఈ రెండు సమస్యలు పరిష్కరించాలన్నారు.

పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ


పెదఅమిరంలో విద్యాసామగ్రి అందించిన దృశ్యం

పాలకొల్లు అర్బన్, జూన్ 28 : స్థానిక 22వ వార్డులోని కొత్తపేట స్పెషల్ మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాలలో శుక్రవారం వార్డు మాజీ కౌన్సిలర్ వట్టం గణేష్ ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలు, విద్యాసామగ్రిని అందజేశారు. 12 వార్డులోని ఎంవీఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వార్డు కూటమి నాయకులు మండెల రాంప్రసాద్, టి నాగ బాబు, వి రామకృష్ణ, కె దినేష్, సిహెచ్ సురేష్ పాఠ్యపుస్తకాలు, షూ, టై, బెల్టు, బ్యాగ్‌లను అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం సిహెచ్ బాలాజీ, ఉపాధ్యాయులు జి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. 24వ వార్డులోని మద్దాల వారి గరువు మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాలలో శుక్రవారం మాజీ కౌన్సిలర్ దుగ్గిన రాము ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో వార్డు నాయకులు సలాది బాబులు నాయుడు, చోడవరపు ఉమామహేశ్వరరావు, అల్లం తాతాజీ, లంకపల్లి హరి, కిషోర్, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉండి: ఉండి కొత్తపేట ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్, పలకలు, స్లేట్ పెన్సిల్స్ తదితర వాటిని ఉచితంగా ఎంపిటీసీ కునుకు రమాదేవి అందించారు. హెచ్‌ఎం దుర్గారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పోలుబోతు రాము, కునుకు దివ్య, టీడీపీ నాయకులు పెద్దింటి బాబు, మల్లువలస రవికుమార్, జనసేన నాయకులు మోపిదేవి హరి, నల్లమట్టి రమేష్, ఆరేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పాందువ్వ ఎంపీపీ పాఠశాలలో దాత చింతలపాటి రాంబాబు సహకారంతో విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. హెచ్‌ఎం పెన్మత్స సత్యనారాయణరాజు పాల్గొన్నారు. మరొక దాత పాందువ్వ స్పెషల్ పాఠశాల హెచ్‌ఎం గోపాలం విద్యార్థులకు డైరీలను అందించారు. కాళ్ల మండలం పెదఅమిరం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ కోరా రామ్మూర్తి, సరాబు ముకేష్ రూ.20వేల విలువైన బుక్స్‌ను పంపిణీ చేశారు. మరొక దాత అలుగు సెబాస్టియన్ రూ.65వేలతో పాఠశాలలో టైల్స్‌ను ఏర్పాటు చేశారు. రూ.10వేలు విలువైన స్టీల్ గ్యాస్ స్టవ్‌ను అందించారు.

వీరవాసరం(భీమవరం టౌన్) : వీరవాసరం మండలం మత్స్యపురిలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన కమలాపురం శ్రీరామ్, చింతా నారాయణమూర్తి సహకారంతో విద్యా సామగ్రి అందించారు. ఈసందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సర్పంచ్ కారిపల్లి శాంతి ప్రియ, జవ్వాది భాస్కరరావు, భవానీ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ఆచంట, జూన్ 28: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్‌లు పెద్ద ఎత్తున పెంచి అందజేస్తామని ప్రభుత్వం ఇప్పటికే చెప్పడంతో దానికనుగుణంగానే జూలై 1న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పింఛన్‌లు పంపిణీ ఒకే రోజున లబ్ధిదారులకు ఇచ్చే విధంగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో పి. నరసింహ ప్రసాద్ తెలిపారు. ఆచంట, కొడమంచిలి, వల్లూరు, ఎ.వేమవరం, గ్రామాల్లో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చేతుల మీదుగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆచంట మండలానికి సంబంధించి గత ప్రభుత్వంలో జూన్ నెలకు సంబంధించి 8205 మంది లబ్ధిదారులకు గాను 2 కోట్ల 37 లక్షల 60 వేల 500 రూపాయలు ఇవ్వగా కూటమి ప్రభుత్వం ద్వారా పింఛన్‌లు సొమ్ము ఏకంగా జూలై 1న 8205 మంది లబ్ధిదారులకు గాను 5 కోట్ల 36 లక్షల 95 వేల రూపాయలు పింఛన్‌దారులకు అందించనున్నారు.

గణపవరం: కూటమి ప్రభుత్వంలో పెంచిన పింఛన్ల నగదు నేరుగా ఇంటి వద్దకే వచ్చి ఉదయం ఆరు గంటల నుంచి గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేస్తారని ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు. పింఛన్ల పంపిణీకి సగటున ప్రతీ గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగి 50 నుంచి 60మంది లబ్ధిదారులకు మించకుండా కేటాయించబడ్డారని నిర్ధారించుకోవాలన్నారు. ఉద్యోగులు సరిపోకపోతే రెవెన్యూ, పంచాయతీరాజ్, ఉద్యోగులను వినియోగించుకుంటున్నామన్నారు. ఒకటో తేదీన ఇవ్వగా మిగిలిన పింఛన్లు రెండో తేదీన కచ్చితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి నగదు రూ.4వేలు పెరిగినందున ఆ మూడు నెలల పెరిగిన నగదుతో జూలైలో రూ.7 వేలు అందిస్తారని తెలిపారు.

అధికారులతో జేసీ సమీక్ష

భీమవరం టౌన్, జూన్ 28 : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ వచ్చేనెల 1వ తేదీ ఉదయం 6 గంటలకు ఎట్టి పరిస్థితుల్లో ప్రారంభం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పెన్షన్ల పంపిణీ ఏర్పాట్లపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నాడు బ్యాంకుల నుంచి నగదును విత్ డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీపై సిబ్బందికి శిక్షణ అందించాలని ఆదేశించారు. నగదును భద్రపరచడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. లబ్ధిదారులకు పింఛన్ అందించిన సమయంలో రసీదుతో పాటు ఫొటో, కరపత్రాన్ని కూడా అందజేయవలసి ఉంటుందన్నారు. అధికారులు సమన్వయంతో పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

వైసీపీ తప్పిదం వల్ల పట్టణానికి తాగునీటి ముప్పు

ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

భీమవరం టౌన్, జూన్ 28 : గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం కారణంగా పట్టణానికి మంచినీటి అవసరాలకు కొనుగోలు చేసిన స్థలాన్ని ఇళ్ళ స్థలాలకు తీసుకోవటంతో భవిష్యత్తులో పట్టణంలో మంచినీటికి ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి నెలకొందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. పైగా 60 ఎకరాల్లో ఇళ్ళ నిర్మాణం చెయ్యటం వల్ల వారు వదిలే సీవేజీ వాటర్ ప్రస్తుతం ఉన్న మంచినీటి చెరువులోకి చేరితే నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. పేదవారికి ఇళ్ళు ఇవ్వటానికి తాము వ్యతిరేకం కాదన్నారు. శుక్రవారం నాడు మునిసిపల్ కార్యాయలంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వం పెద్దలు ఎంతో ఆలోచన చేసి వేంద్రలో ట్యాంకుల నిర్మాణానికి స్థల సేకరణ చేశారని, పట్టణానికి దూరంగా ఉంటే కాలుష్యం కాకుండా ఉంటుందనే ఉద్దేశంలో ఏర్పాటుచేస్తే దానిని నాశనం చేసింది ఈ వైసీపీ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలంటే నియోజకవర్గంలో పరిధిలో కొన్ని వేల ఎకరాలు ఉన్నాయని, ఎక్కడైనా సేకరించి ఇవ్వవచ్చునని, ఎందుకు మునిసిపాల్టీ సేకరించిన 60 ఎకరాలను తీసుకున్నారో తెలియటంలేదన్నారు. దీనికి అధికారులు సమాధానం చెబుతూ ఇంకా ఇళ్ళు మంజూరుకావలసి ఉందని చెప్పటంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. గత ప్రభుత్వం చేసిన తప్పును తాము చెయ్యమని, ఈ లే- అవుట్‌లో ఇళ్ళు మంజూరు చెయ్యబోమని స్పష్టం చేశారు. అక్కడ ఎటువంటి ఇబ్బందులు రాకుండా హౌసింగ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

పక్షపాతం, అవినీతి లేకుండా అభివృద్ధి: నాయకర్


ఎమ్మెల్యే నాయకర్‌ను సన్మానించిన కమిషనర్, ఉద్యోగులు

నరసాపురం, జూన్ 28: పక్షపాతం, అవినీతి లేకుండా పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తా, పాలనలో పురపాలక అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ ఎవరూ అవినీతికి పాల్పడినా వదిలేది లేదు, శానిటేషన్, తాగునీరుకు అధిక ప్రాధాన్యం ఇవ్వండి, ప్రజల నుంచి సమస్యలు రాకుండా మంచి పాలన కౌన్సిల్ అందించాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ హెచ్చరించారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా కౌన్సిల్‌కు విచ్చేసిన ఆయన స్థానిక సమస్యలపై ఫైర్ అయ్యారు. గతంలో కొన్ని వార్డులకే అభివృద్ధి చేశారు, కానీ ఇప్పుడు అలా కుదరదు, ప్రతి వార్డును అభివృద్ధి చేయాలి, శానిటేషన్, తాగునీరు, డ్రెయినేజీల నిర్వహణ, ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలి, అంతేగాని ప్రజా సమస్యలు పక్కన పెట్టి పని చేస్తే ఊరుకునేది లేదన్నారు.

జనసేన కౌన్సిలర్లు ఆందోళన

తొలిసారిగా కౌన్సిల్ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాయకర్‌కు అధికారులు సరైన గౌరవం ఇవ్వకపోవడంపై జనసేన కౌన్సిలర్ కృష్ణవేణి, వన్నెంరెడ్డి మండిపడ్డారు. కనీసం ఒక్క బ్యానర్ కూడా ఏర్పాటు చేయకపోవడంపై మండిపడ్డారు. ఎమ్మెల్యేకు మీరిచ్చే గౌరవం ఇదేనాంటూ ప్రశ్నించారు. దీనికి కమిషనర్ వెంకటేశ్వరావు మరోసారి ఇలా జరగకుండా చూస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికే కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే లోనికి రాకుండా బయటే ఉండిపోయారు. ఇది తెలుసుకున్న కమిషనర్, ఇతర ఉద్యోగులు ఆయన్ను కలిసి లోనికి రావాలని ఆహ్వానించారు. మరోసారి ఇలాంటి తప్పు జరగకుండా చూస్తామని చెప్పడంతో ఆయన కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లారు. కౌన్సిల్ సమావేశానికి చైర్‌పర్సన్ వెంకట రమణ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో వీసీలు కొత్తపల్లి నాని, నాగిని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు బొకే అందిస్తున్న నరసాపురం ఇన్‌చార్జి పొత్తూరి, తదితరులు.. భీమవరం నాయకులు మెంటే పార్థసారథి, మద్దుల రాము సన్మానం.. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జి.. నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు అభినందనలు

నరసాపురం టౌన్, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అమరావతిలోని పార్టీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన్ను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పార్టీ శ్రేణులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పల్లాకు బొకే ఇచ్చి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు ఆకన సుబ్రహ్మణ్యం, జోగి పండు, నాగిడి రాంబాబు, మన్నే బాలకృష్ణ పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్‌ను శుక్రవారం పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీను, సీనియర్ నాయకులు మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, ఐజాక్ బాబు, చల్లబోయిన గోవిందు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తాడేపల్లిగూడెం అర్బన్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ను విజయవాడ టీడీపీ కార్యాలయంలో పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి శుక్రవారం కలసి సత్కరించారు. పోతుల అన్నవరం, గంధం సతీష్ ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చిట్టిరాజు

సివిల్స్ ర్యాంకర్ చిట్టిరాజుతో చర్చాగోష్ఠి

భీమవరం రూరల్, జూన్ 28 : విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ, బీవీరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సివిల్ ఫలితాలలో 833వ ర్యాంక్ సాధించిన కొయ్యే చిట్టిరాజుతో శుక్రవారం చర్చా గోష్ఠి నిర్వహించారు. చిట్టిరాజు మాట్లాడుతూ ఇంటర్నెట్ ఉపయోగంతో పాటు ప్రముఖ పుస్తక రచయితలు బిపిన్ చంద్ర, లక్ష్మీకాంత్, రమేష్‌చంద్ వంటి వారి పుస్తకాలు ప్రిపరేషన్‌కి ఉపయోగపడతాయని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో విష్ణు ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రసాదరాజు, శ్రీనివాసరాజు, రమేష్‌రాజు పాల్గొన్నారు.

మిరామియాకోడు సమస్య పరిష్కరించాలి

భీమవరం టౌన్, జూన్ 28 : మెంటే వారితోటలోని మిరామియాకోడులో వర్షాలు కురిస్తే నీరు బయటకు వచ్చి ఇళ్ళల్లోకి రావటంతో ఇబ్బందులుపడుతున్నామని మెంటేవారి తోట మిరామియా కోడు గట్టు అనుకుని ఉన్న ప్రజలు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు మొరపెట్టుకున్నారు. ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినపుడు మాత్రమే మోటార్లుపెట్టి నీరుతోడుతారని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయనను కోరారు.

చంద్రయ్య మృతి తీరని లోటు

భీమవరం రూరల్, జూన్ 28 : ఇంజేటి చంద్రయ్య మృతి పేదలకు, దళితులకు తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం అన్నారు. గురువారం నాడు ఆకస్మికంగా మృతి చెందిన చంద్రయ్య భౌతిక దేహాన్ని శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం, జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్‌వి గోపాలన్ సందర్శించి నివాళులర్పించారు.


ముదునూరులో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ భాను నాయక్.. పిప్పరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధులపై అవగాహన కల్పించాలి

పాలకోడేరు, జూన్ 28: వర్షాకాలంలో దోమల వలన వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు ఎప్పటి కప్పుడు అవగాహన కల్పించి వారికి వ్యాధులను దూరం చేసే విధంగా వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌వో భానునాయక్ అన్నారు. పాలకోడేరులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో ఆయన శుక్రవారం కలిసి మాట్లాడారు. ప్రతీ శుక్రవారం గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ దోమల నిల్వ ఉండేప్రాంతాలు గుర్తించి నీరు నిల్వ ఉండకుండా ఆయా గృహాల వారికి అవగాహన కల్పించాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగే విధంగా ప్రజలకు తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

గణపవరం: వర్షాకాలం ప్రారంభమైనందున కాలానుగుణంగా దోమల ద్వారా వచ్చే వ్యాధుల నివారణకు అందరూ సమష్టిగా కృషి చేయాలని గణపవరం, పిప్పర ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్, సంతోష్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం గణపవరం, పిప్పర, కాశిపాడు డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాలు పెరగడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎంపీహెచ్‌వోలు విల్సన్‌బాబు, వెంకటేశ్వర్లు, సుబ్బలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భాను నాయక్ అన్నారు. శుక్రవారం ముదునూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో ఫార్మసీ, ల్యాబ్ తదితర వాటిని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. తాగునీటి శాంపిల్స్ ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.పూజిత, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలతో రహదారుల ఛిద్రం


అధ్వానంగా ప్రత్తిపాడు-అలంపురం రహదారి.. పాలకొల్లులోని హెచ్‌బీ కాలనీ రోడ్డు

పెంటపాడు, జూన్ 28: అసలే అంతంతమాత్రంగా ఉన్న రహదారులు వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు నరకం అనుభవిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాలలోని రహదారులు మరింత అధ్వానంగా మారాయి. మండలంలోని ప్రత్తిపాడు నుంచి అలంపురం, కె.పెంటపాడు నుంచి పడమరవిప్పర్రు, బి.కొండేపాడు నుంచి మీనవల్లూరు, చింతపల్లి, కోరుమిల్లి నుంచి బి.కొండేపాడు, ప్రత్తిపాడు-రాచర్ల తదితర రహదారులన్నీ వర్షం నీటితో ఛిద్రమయ్యాయి. ఈ రహదారులపై ప్రయాణాలు సాగించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాలకొల్లు అర్బన్/రూరల్: మూడు రోజులుగా వర్షాలు పడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా జీవనానికి తీవ్ర ఆటకం ఏర్పడింది. వర్తకులు, వినియోగదారులు వర్షంలోనే మార్కెట్ పనులు, ఇతర పనులకు తిరిగారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాన తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అయినప్పటికీ ఆకాశంలో మేఘాలతో పాటు ఉరుములు, మెరుపులు కూడా ఏర్పడుతున్నాయి. మండలంలో వర్షాలు కురవడంతో గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆగర్రు, ఆగర్తిపాలెం, వెలివెల, కొత్త పేట, దిగమర్రు, వరధనం కాపవరం, అరట్లకట్ట, శివదేవుని చిక్కాల, తిల్లపూడి గ్రామాల్లో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

బలుసులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 28: తాడేపల్లిగూడెంలోని బలుసులమ్మ వారిని శుక్రవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈవో రవిశంకర్ ఆయనను సత్కరించారు. అనంతరం 31వ వార్డులోని బాల వర్తనపల్లి కాశి, దాట్ల కనకదుర్గమ్మ వారిని బొలిశెట్టి దర్శించుకున్నారు. జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.

గొంతేలమ్మ ఆలయ వార్షికోత్సవం

మొగల్తూరు, జూన్ 28: పేరుపాలెం నార్త్‌లోని ఇంజేటివారిపేటలోని గొంతేలమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్ట్, సమరత సేవా ఫౌండేషన్ సహకారంతో ఏడాది క్రితం నిర్మించిన ఈ ఆలయ వార్షికోత్సవం నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపించారు.

మూర్తిరాజు కాలేజీలో ఎంకాం కోర్సు ప్రారంభం

గణపవరం, జూన్ 28: చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఎంకాం కోర్సు ప్రారంభించామని ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి తెలిపారు. డిగ్రీ పాసై ఏపీ పీజీసెట్‌లో క్వాలిఫై అయిన విద్యార్థులు తమ కళాశాలలో పీజీ చేరవచ్చన్నారు. ఈ అవకాశాన్ని గణపవరం పరిసర గ్రామాల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలకు పీజీ కోర్సు మంజూరు చేసిన కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌కు ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదుల నిరసన

తణుకు, జూన్ 28: కొత్త క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ హాలు వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. కొత్త చట్టాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌కు పాలిటెక్నిక్ కీలకం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాలకవర్గ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 28: విద్యార్థులు ఇంజనీరింగ్‌లో రాణించాలంటే పాలిటెక్నిక్ కీలకమని వాసవి ఇంజనీరింగ్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ పేర్కొన్నారు. పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులను శుక్రవారం కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాల పాలకవర్గ సహాయ కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, కోశాధికారి పేరూరి బాలకాశియ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా గురుకుల పాఠశాల

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలలకు పెదతాడేపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల రోల్ మోడల్‌గా ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెదతాడేపల్లిలోని గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు కిట్‌లను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజారావు విద్యార్థుల ప్రగతిని వివరించగా బొలిశెట్టి ప్రిన్సిపాల్ రాజారావు, సిబ్బందిని అభినందించారు. ముందుగా పెదతాడేపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ పోతుల అన్నవరం, మాజీ ఎంపీటీసీ పసుమర్తి చందు ఆధ్వర్యంలో యువతకు కిట్‌ల పంపిణీ చేశారు. ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ, ఎంఈవోలు వి. హనుమ, పీఎంకే జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

పోడూరు, జూన్ 28: పండితవిల్లూరులో ఆశ్రం ఆసుపత్రి వైద్య బృందంచే శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. న్యూలైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ జి.సామ్యేల్ జాన్సన్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు.

మంచినీటి కోసం రోడ్డెక్కిన సమతానగర్ ప్రజలు


నూతన కనెక్షన్లు కలపవద్దంటూ ఆందోళన చేస్తున్న సమతానగర్ వాసులు

ఆకివీడు, జూన్ 28: సమతానగర్ ప్రాంతంలో పైపు లైన్ కనెక్షన్లు నిలుపుదల చేయాలంటూ స్థానికులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. సమతానగర్ ప్రజలకు తాగునీరందించేందుకు గతంలో ఆకివీడు నుంచి రెండు మంచినీటి పైపులైన్లు వేశారు. వాటిలో ఒకదాని నుంచి ఒకదానికి ఐదు కనెక్షన్లు కలిపేందుకు శుక్రవారం నగర పంచాయతీ సిబ్బంది తవ్వారు. విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకొని ఆందోళనకు దిగారు. దీంతో సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి విషయం తెలుసుకున్నారు. ఇప్పటికే తమకు తాగునీటి సమస్య ఏళ్ళ తరబడి ఉందని ఇప్పుడు ఈ కనెక్షన్లు కలిపితే మరింత సమస్యగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చేసేది లేక పోలీసులు, సిబ్బంది వెను తిరిగారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాజు, స్థానికులు భైరి అంజనేయులు, డి.కల్యాణి, ఒగిరాల ఏలీయా, కొయ్యే శ్రీను, భైరి శివ, సోమాల లక్ష్మి, కొయ్యే సీతమ్మ, బొడ్డు ధనమ్మ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆలోచనా సరళిని మార్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

భీమవరం టౌన్, జూన్ 28 : కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనా సరళిని మార్చుకోవాలని, కాంగ్రెస్ పార్టీ విష ప్రచారాలను చేస్తూ విధ్వంసాలను సృష్టించబోతుందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారా యణ విమర్శించారు. భీమవరం బీజేపీ (కేంద్ర సహాయ మంత్రి వర్మ) కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వామపక్షాలను కలుపుకుని వింత పోకడల ఆలోచనలతో ముందుకు సాగుతున్నదని, రాజ్యాంగాన్ని సవరిస్తారని విష ప్రచారాలను చేస్తుందని అన్నారు. ఎస్సీ ఎస్టీ హక్కులను మారుస్తారని కాంగ్రెస్ చేస్తున్న విష ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొడతారని, ప్రజల మనోభావాల్ని కాంగ్రెస్ పార్టీ దెబ్బతీస్తుందని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధానం సరిగ్గా లేదని, అధికార దాహంతో వారి వ్యవహార శైలి ఉందని అన్నారు.

అన్నసమారాధన

భీమవరం టౌన్, జూన్ 28 : టూ టౌన్‌లోని 36వ వార్డు, రామరాజు తోటలోని మావుళ్ళమ్మ జాతర ముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. ప్రధాన దాతలు వేగేశ్న గోపాలకృష్ణంరాజు, వేగేశ్న శివరామరాజు పూజాధికాలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో మావుళ్ళమ్మ సేవాసమితి అధ్యక్షురాలు రామాయణం వెంకటలక్ష్మి తులసి పార్వతి, కార్యదర్శి రేవూరి గోగురాజు, రామా యణం సుధీర్, మావుళ్ళమ్మ సేవా సమితి గౌరవాధ్యక్షుడు పంజా లక్ష్మణరావు తదితరులు పర్యవేక్షించారు.

పేద విద్యార్థికి సైకిల్, నోట్ పుస్తకాల అందజేత

భీమవరం టౌన్, జూన్ 28 : భీమవరం ఏఆర్ కేఆర్ మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న సీహెచ్ నరేంద్రకుమార్‌కు పట్టణానికి చెందిన వంగలపూడి రాధాకుమారి సహకారంతో నూతన సైకిల్, నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రి అందించారు. వన్‌వన్ ఎస్సై వెంకటేశ్వరరావు, నిర్వాహకుడ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు. అనంతరం రాధాకుమారి పుట్టినరోజు సందర్భంగా ప్రేమాలయం లో వృద్ధులకు భోజనాలు ఫ్రూట్స్ పంపిణీ చేశారు.

రైతుల ధాన్యం బకాయిలు చెల్లించాలి

భీమవరం అర్బన్, జూన్ 28: ప్రభుత్వం నుంచి రైతులకు రావాలసిన ధాన్యం బకాయిలు వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంకా కృష్ణమూర్తి, రైతు నాయకులు పెచ్చేటి లక్ష్మణరావు ప్రభుత్వాని కోరారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం సొమ్మును ఇప్పటివరకు ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. సార్వాపంటకు పెట్టుబడికి డబ్బులు లేక గతంలో తెచ్చిన బాకీలకు డబ్బులు కట్టలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు.

పొగాకు అ'ధర'హో..

» కిలో పొగాకు ధర రూ.368

» సిరులు కురిపిస్తున్న సాగు » వర్జీనియాకు 50 ఏళ్లలో అత్యధిక ధర » ఆనందంలో రైతు కుటుంబాలు

గోపాలపురం, జూన్ 28: ఏజెన్సీ మెట్ట ప్రాంత రైతాంగానికి పొగాకు సాగు సిరులు కురిపిస్తుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో తేలిక నేలల్లో పండే వర్జీనియ పొగాకు పంట లేకపోతే రైతులతో పాటు రైతుకూలీలకు ఒకప్పుడు పని ఉండేది కాదు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు గత 50 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర పలుకుతోంది. ఈ ప్రాంతంలో పండే పంట దేశంలోనే నాణ్యమైనది కావడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో పండే పొగాకు పంటకు ధరలో వ్యత్యాసం పలుకుతోంది. గతంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన పొగాకు రైతాంగం అప్పులు తీరగా రెండో ఏడాది పంట వేయకతప్పడం లేదనే భావనలో ఉన్నారు. రెండేళ్ల నుంచి పొగాకు సాగు ప్రారంభం నుంచి ఎన్నడూ లేని ధరలు కిలో పొగాకు ధర రూ.368 పలికింది. దీంతో తమ కష్టానికి తగిన ఫలితం చూస్తున్నామనే భావనతో పొగాకు రైతు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధర రావడంతో రైతులు, రైతుకూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గోపాలపురం వేలం కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకు బేళ్లు

ధరకు తగ్గ దిగుబడి లేదు



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో పెట్టుబడికి తగిన దిగుబడి రాలే దు. పొగాకు సాగు చేసే రైతులకు పెట్టుబడుల నుంచి బయటపడే అవకాశం ఉంది.

- ముళ్ళపూడి శివాజీ
పొగాకు రైతు, చెరుకుమిల్లి.

ధరల పెంపుతో ఊరట



పొగాకు సాగు ప్రారంభం నుంచి ఇప్పటివరకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సన్న, చిన్నకారు రైతులు పొగాకు ధరతో ఊపిరి పీల్చుకున్నారు. నష్టాల బారిన పడి ఆత్మహత్యలు చేసుకుందామనే స్థితి నుంచి కుటుంబ సమేతంగా గుప్పెడు మెతుకులు తింటున్నామన్న భావం వచ్చింది. ధరలు రైతులకు ఊరటనిచ్చినట్లయింది.

- కొడవటి చినవెంకటేశ్వరరావు
పొగాకు రైతు, గోపాలపురం

ఉద్యాన వర్సిటీలో ఏం జరుగుతోంది ?

వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయంలో దేశంలోనే రెండోది. ఇదే విషయాన్ని వైసీపీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునేది. విశ్వవిద్యాలయ అధికారులు సైతం గర్వించేవారు. ప్రతి సదస్సు, సమావేశాల్లోనూ ప్రస్తావించేశారు. గడచిన ఐదేళ్లుగా ఉద్యాన విశ్వవిద్యాలయం మసకబారిపోయింది. పదవులు పట్టుకుని వేలాడే అధికారులు తప్ప.. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకున్న చర్యలు లేవు. ప్రభుత్వం కూడా అదే ధోరణి అవలంభించింది.

» హైకోర్టులో వీసీ నియామకం రద్దు.. అయినా విధుల్లోనే వైస్ చాన్సలర్
» ప్రభుత్వ నిర్ణయం ఏమిటో.. ?

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : వైఎస్ఆర్ పేరుతో ఉన్న విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్న ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. ప్రతినిత్యం ఏదో ఒక విషయమై రచ్చ సాగుతోంది. తాజాగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ పదవి వివాదస్పదమైంది. వైస్ చాన్సలర్ డాక్టర్ జానకీరామ్‌ను రెండోసారి నియమించడ్నాన తప్పు పడుతూ విశ్వవిద్యాలయ విశ్రాంత ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించారు. మొదటిసారి నియామకమే అడ్డదారిలో జరిగిందని హైకోర్టు వ్యాఖ్యానించింది. వైస్ చాన్సలర్ నియామకాన్ని రద్దు చేసింది. దాంతో ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఇది తీవ్ర చర్చకు దారితీసింది. వైస్ చాన్సలర్ డాక్టర్ జానకీరామ్ రాజీనామా చేస్తారని అంతా అనుకున్నారు. ఆయన మాత్రం యథావిధిగానే విధులకు హాజరవుతూ పాలన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్న ధ్యాసతో ఉన్నారు. వాస్తవానికి వైసీపీ హయాంలో విశ్వ విద్యాలయ అధికారులంతా వైసీపీ ప్రభుత్వానికి వంతపాడారు. ఏకపక్షంగా వ్యవహరించారు. అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రభుత్వ పరంగా నిధులు రాబట్టలేకపోయారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిని విస్మరించారు. పోస్టింగ్ నియామకంలోనూ పక్షపాతంగా వ్యవహరించారన్న అపవాదును ఎదుర్కొన్నారు. వైస్‌చాన్సలర్ పదవీ కాలం పూర్తికావడంతో ఎన్నికలకు ఆరు నెలల ముందు మరోసారి దక్కించుకున్నారు. రెండో పర్యాయం ఆయననే నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.


ఉద్యాన వర్సిటీ

సెర్చ్ కమిటీ ఏమైనట్టు ?

విశ్వవిద్యాలయంలో వైస్‌చాన్సలర్ నియమించాలంటే సెర్చ్ కమిటీ ఏర్పాటు చేస్తారు. ఆ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని సెర్చ్ కమిటీ పరిశీలిస్తుంది. ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ప్రభుత్వానికి ముగ్గురు పేర్లను ప్రతిపాదిస్తుంది. ప్రభుత్వ సిఫారసు మేరకు గవర్నర్ అందులో ఒకరిని వైస్ చాన్సలర్‌గా నియమిస్తారు. ఒక్కోసారి ప్రభుత్వ సిఫారసులను పక్కనపెట్టి.. అదే ముగ్గురిలో మరో వ్యక్తిని నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. భారత వ్యవసాయ పరిశోధన మండలినుంచి ఎవరినైనా నియమించాలంటూ ముందుగా ఆ సంస్థ అనుమతి ఉండాలి. ఇవేమీ పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వంలో ఉద్యాన విశ్వవిద్యాలయానికి వైస్‌చాన్సలర్‌ను నియమించారు. రెండోసారి అదే వ్యక్తికి వీసీ పదవిని కట్టబెట్టింది. దీనిని హైకోర్టు తప్పుపట్టింది. వీసీ నియామకాన్ని రద్దు చేసింది. ఇప్పుడు బంతి రాష్ట్ర ప్రభుత్వ కోర్టులో ఉంది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అప్పటిదాకా వేచి చూడాలన్న తలంపుతో వీసీ ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే ఎప్పటిలాగే విధులకు హాజరవుతున్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

పెనుగొండ, జూన్ 28 : విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి చెందిన ఘటన వడలి గ్రామంలో జరిగింది. ఎస్ఐ షేక్ సుభాణీ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన కౌలురైతు తానేటి గంగయ్య(58) గురువారం సాయంత్రం పొలం వెళ్లి దారికి అడ్డంగా పడి ఉన్న విద్యుత్ వైరును పట్టుకోవడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. రాత్రి అంతా ఇంటికి తిరిగి రాకపోవడంతో గాలించగా శుక్రవారం ఉదయం పొలంలో మృతి చెంది ఉన్నాడు. అతడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. విద్యుత్ శాఖ వైఫల్యం వల్ల కౌలు రైతు చనిపోయాడని, ఆ కుటుంబానికి రూ.15 లక్షల నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం వడలి శాఖ నాయకులు డిమాండ్ చేశారు.

ప్రేమికుడు జైల్లో ఉన్నాడని బాలిక ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూన్ 28 : ప్రేమించిన యువకుడు జైలులో ఉన్నాడని తన ప్రేమను పెద్దలు వ్యతిరేకించారని మనస్తాపంతో ఒక బాలిక (16) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏలూరులో ఓ ప్రాంతానికి చెందిన బాలిక పదో తరగతి చదివింది. తన మొబైల్‌లోని ఇన్‌స్టాగ్రామ్‌లో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన వరికూటి మధుకుమార్(20)తో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఈనెల 18వ తేదీన ఆ బాలికను ఏలూరు బస్టాండ్‌కు రమ్మని అక్కడ నుంచి తన గ్రామానికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేయగా అనంతరం పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మధుకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ బాలిక గురువారం రాత్రి తన ఇంట్లో అందరూ నిద్రపోయిన తరువాత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం నిద్రలేచి చూసేసరికి ఆ బాలిక మరణించింది. ఆ ప్రాంత పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, జూన్ 28 : మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో శుక్రవారం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఒంటెద్దు నరసింహారావు(25) అనే యువకుడికి జనవరి నెలలో తండ్రి నరసింహారావు మృతి చెందడంతో తన పెదనాన్న ఇంటి వద్ద ఉంటున్నాడు. అప్పటి నుంచి ఆ యువకుడి మానసిక స్థితి సరిగాలేదని తెలిపారు. ఈక్రమంలో శుక్రవారం స్థానిక పిరమిడ్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. పురుగుల మందు తాగినట్లు క్రాంతికుమార్ అనే వ్యక్తికి తెలియజేయగా అతడు ఘటనా స్థలానికి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరి మృతి

కైకలూరు, జూన్ 28: కత్తిపూడి-పామర్రు జాతీయ రహదారిలో లారీ మోటారుసైకిల్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. శుక్రవారం రాత్రి కైకలూరు మండలం గుమ్మళ్ళపాడుకు చెందిన యాళ్ళ భీమరాజు(45) తన పనులపై పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఆకివీడు నుంచి తన స్వగ్రామం వెళుతుండగా సోమేశ్వరంలో ఉప్పుటేరు సెంటర్లో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన తెలుసుకున్న కైకలూరు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

» ఆరు కేజీల 200 గ్రాముల గంజాయి స్వాధీనం

ఏలూరు క్రైం, జూన్ 28 :గంజాయిని కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను ఎస్ఐ మదీనీబాషా అరెస్టు చేశారు. ఏలూరు తంగెళ్ళమూడిలో కొంతమంది యువకులు గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ బాషా తన సిబ్బందితో వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. భీమడోలులోని గణపతినగర్‌కు చెంది పప్పుల సురేష్, ఏలూరు గ్వేవియర్ నగర్‌కు చెందిన నడిపూడి కల్యాణ్, ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన పర్వాక అశోక్, మరో 17 ఏళ్ల యువకుడిని అరెస్టు చేశారు. వారి నుంచి ఆరు కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

మహిళను మోసగించి రూ.49 వేలు అపహరణ

ఏలూరు క్రైం, జూన్ 28 : ఒక మహిళ తన కొత్త ఏటీఎం కార్డును పిన్ జనరేట్ చేయడానికి ఏటీఎం సెంటర్‌కు వెళ్ళగా అక్కడ ఓ వ్యక్తి సాయం చేస్తానంటూ ఏటీఎం కార్డును మార్చేశాడు. ఆ కార్డు ద్వారా రూ.49 వేలు డ్రా చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు సమీపంలోని కొత్తూరునకు చెందిన కాట్రగడ్డ శుభాషిణి తన ఏటీఎం కార్డు పిన్ జనరేట్ చేయడానికి ఏలూరు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో ఉన్న ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అక్కడ పిన్ జనరేట్ చేసే సమయంలో ఒక వ్యక్తి సాయం చేస్తానంటూ ఏటీఎం కార్డు తీసుకుని పిన్ జనరేట్ చేసి కార్డు మార్చేశాడు. ఆ తరువాత 49 వేల రూపాయలు డ్రా అయినట్టు మెస్సేజ్ రావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరికి కొత్తనీరు

» స్వల్పంగా పెరిగిన వరద నీరు

కుక్కునూరు/వేలేరుపాడు, జూన్ 28: గోదావరికి కొత్తనీరు చేరింది. నిన్నటి వరకు గోదావరిలో నీరు లేక వెలవెలబోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులోకి కొత్తనీరు చేరింది. శుక్రవారం ఎగువ భాగాన గల గోదావరికి దిగువ భాగానికి వరదనీరు చేరుకోవడంతో ఇసుక మేటలు మునగడంతో పాటు వాగుల నుంచి ప్రవహించడంతో వరదనీటితో జలకళ కనిపిస్తోంది. తెలంగాణ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల మరింత వరదనీరు చేరుకోవడంతో భద్రాచలం వద్ద స్వల్పంగా నీటిమట్టం నమోదవుతుంది. రానున్న మరో 2,3 రోజులకు మరింత వరదనీరు చేరుకునే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జూలై రాకముందే గోదావరికి వరదనీరు చేరుకోవడంతో ఈ ఏడాది కూడా గోదావరికి వరదలు పోటెత్తే అవకాశాలు ఉండడంతో వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కుక్కునూరు మండల తహసీల్దార్ అచ్యుతకుమారి మాట్లాడుతూ గోదావరిలో చేపలు పట్టడానికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరిలో నీరు లేకపోవడంతో గోదావరి అవతల ఉన్న గ్రామా లకు పలు రాకపోకలు సాగిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.


రుద్రమ్మకోట వద్ద పెరిగిన గోదావరి

ఏపీ టూరిజం బోట్ల నిలిపివేత

పోలవరం జూన్ 28 : ఏపీ టూరిజం బోట్లను తాత్కాలి కంగా నిలిపివేసినట్టు ఏపీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ ఆర్.గంగబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాభావం వల్ల ఈదురుగాలులు వీస్తున్న నేపథ్యంలో ఏపీ టూరిజం పేరంటాలపల్లి విహారయాత్ర బోట్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని వాతావరణ పరిస్థితులు మెరుగైన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పునఃప్రారంభిస్తామని తెలిపారు.


పోశమ్మ గుడి వద్ద నిలిచిన టూరిజం బోట్లు

నదులు, చెరువు గట్లను పటిష్ట పరచాలి

» ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, జూన్ 28 : జిల్లాలో బలహీనంగా ఉన్న నదులు, చెరువుల గట్లను పరిశీలించి యుద్ధప్రాతిపదికన పటిష్టపరచాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశం మందిరంలో శుక్రవారం ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను ఆమె అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో తుఫాన్‌లు, వరదలు సంభవించే అవకాశం ఉన్నందున బలహీనంగా ఉన్న గట్లను వెంటనే పటిష్టం చేయాలన్నారు. వరదల సమయంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలను అప్రమత్తం చేసే అంశంపై ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. గోదావరి నదికి భద్రాచలం, ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక వెలువడిన వెంటనే ప్రజలను ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల ఏర్పాటు, తదితర విధులకు సంబంధించి సిబ్బందికి విధులు కేటాయించి సిద్ధం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద , భోజన, వసతి సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్యం, వైద్య కేంద్రాలు, తదితర ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గిరిజన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లోని మారుమూల పల్లె ప్రాంతాలకు వరదల సమయంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతున్నందున నిత్యావసర సరుకులను ముందుగానే పంపించాలన్నారు. కాల్వలు, వాగులు పొంగే అవకాశం ఉన్నందున కాజ్‌వే వంటి వాటి వద్ద వరద నీరు ఉధృతి ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఉంచాలని ప్రజలు ఎవరినీ అనుమతించకుండా అక్కడ సిబ్బందిని నియమించాలన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ, డీఆర్‌వో డి.పుష్పమణి, ఆర్డీవోలు ఎన్ఎస్‌కే ఖాజావలి, హౌసింగ్ పీడీ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయం రంగంలో ఇంజనీర్లు, ఆధునిక సాంకేతికత కీలకం

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 28 :వ్యవసాయరంగంలో ఇంజనీర్లు, ఆధునిక సాంకేతికత పాత్ర ఎంతో కీలకమైందని రాయచూర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ఎంటమాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రభురాజ్ అన్నారు. ఏపీ నిట్‌లో శుక్రవారం ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగం సౌజన్యంతో 'వ్యవసాయరంగంలో ఇంజనీర్, అధునిక సాంకేతికత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట విత్తిన నుంచి చేతికి వచ్చేంత వరకూ పలువురు రైతులు యాంత్రీకరణ ఉపయోగించి రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నారన్నారు. నేల సారం, తేమ, వాతావరణం వంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కృత్రిమ మేధస్సు, డ్రోన్ టెక్నాలజీ, మిషన్ లెర్నింగ్ తదితర ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకున్నప్పుడే పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు దిగుబడి పెంచుకోవచ్చన్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు తమ బృందం ఈ-శాప్ యాప్ రూపకల్పన చేసిందని దీనిద్వారా పంట ఆరోగ్య పరిస్థితులు, తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులను సులువుగా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కార్తికేయశర్మ, డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

అత్తిలిలో విగ్రహాలు ధ్వంసం.. కేసు నమోదు

అత్తిలి, జూన్ 28 : అత్తిలి కాల్వ గట్టున ఉన్న విజయ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో గల ఉపాలయంలోని గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవారి విగ్రహాల చేతులను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆలయ ధర్మకర్త కందుల సత్యనారాయణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారి ఆలయానికి అనుబంధంగా గత ఏప్రిల్‌లో శివలింగం, వల్లీ దేవసే సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించినట్టు తెలిపారు. గురువారం సాయంత్రం ఓ భక్తుడు ఉపాలయంలో గల అమ్మవారు, వినాయకుడి విగ్రహాల చేతులను విరిగినట్టు గుర్తించి అర్చకుడు కృష్ణవంశీకి సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. ఆలయానికి సీసీ కెమేరాలు ఉన్నప్పటికీ.. ఆ సమయంలో పనిచేయకుండా చేసినట్టు గుర్తించి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆలయం వద్ద భద్రతా చర్యలు తీసుకుంటున్నామని అత్తిలి ఎస్ఐ వి.రాంబాబు తెలిపారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

పారిజాత గిరి శ్రీవారి ఆదాయం రూ.8.69 లక్షలు

జంగారెడ్డిగూడెం, జూన్ 28 : జంగారెడ్డిగూడెం పట్టణం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీల ఆదాయం రూ.8,69,182 వచ్చిందని ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆలయంలో మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షణలో 90 రోజులకు గాను హుండీల లెక్కింపు నిర్వహించారు. మద్ది ఆంజనేయస్వామి దేవస్థాన కార్యాలయ పరిపాల నాధికారి కె.రంగారావు, కామయ్యపాలెం సేవాసంఘం సభ్యులు, ఏలూరు రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ సభ్యులు, ఇండియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుడి కారు నుంచి మంటలు

» బయటకు పరుగులు తీయడంతో తప్పిన పెనుముప్పు



ద్వారకాతిరుమల, జూన్ 28: శ్రీవారి క్షేత్రానికి వచ్చిన ఓ భక్తుడి కారు నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అందులోని వారు అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. దీంతో పెనుముప్పు తప్పింది. ఈ ఘటన కొండ దిగువనున్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. భీమవరానికి చెందిన శివారపు చల్లారావు కుటుంబసమేతంగా శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమలకు వచ్చారు. స్థానిక బ్యాంక్ వద్దకు చేరుకునే సరికి ఒక్కసారిగా కారు నుంచి పొగ, మంటలు వ్యాపించాయి. కారును ఆపి కేకలు పెడుతూ బయటకు పరుగులు పెట్టి ప్రాణాలను రక్షించుకున్నారు. కారులో ఇద్దరు చిన్న పిల్లలు ఉండటం.. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు వాటర్‌పైప్ ద్వారా మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంజన్లో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఈవిధంగా మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు.

విద్యా సమాచారం

11 నుంచి డీఎస్సీకి ఉచిత శిక్షణ తరగతులు

ఏలూరు కలెక్టరేట్, జూన్ 28: బీసీ స్టడీ సర్కిల్ ఏలూరులో డీఎస్సీ పరీక్షకు బీసీ, ఎస్సీ, ఎస్టీకి సంబంధించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అభ్యర్థులకు జూలై 11 నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల ఆసక్తి ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో జూలై 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవా లన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీఈడీ, కుల, ఆదాయ ధ్రువీక రణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అభ్యర్థులు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు రూ.1500 స్టైఫండ్, బుక్స్ అలవెన్సు కింద రూ.వెయ్యి ఇస్తామన్నారు. మరింత సమా చారానికి బీసీ స్టడీ సర్కిల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లీష్ మీడియం యూపీ స్కూల్, వెన్నవల్లివారిపేటలో సంప్రదించాల న్నారు. సమాచారానికి 99123 94799 నంబరులో సంప్రదించాలన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు రెండో విడత నోటిఫికేషన్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 28 : జిల్లాలోని ఐదు ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో పలు కోర్సుల్లో అడ్మిషన్లకు రెండోవిడత కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ పి.రజిత శుక్రవారం విడుదల చేశారు. ఐటీఐలలో మిగిలివున్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను జూలై 24 సాయంత్రం ఐదు గంటల్లోపు విద్యార్థులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుచేసిన అనంతరం అప్లికేషన్ కాపీ ప్రింటవుట్‌ను, ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థి ఎంచుకున్న సంబంధిత ఐటీఐలలో జూలై 25 సాయంత్రం 5 గంటల్లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు జూలై 27, 28వ తేదీలలో, ప్రైవేటు ఐటీఐలలో అడ్మిషన్లకు 29, 30వ తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం 08812-230269 నంబరులో సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 627 సీట్లు, ప్రైవేటు ఐటీఐలలో 1650 సీట్లు రెండో విడత అడ్మిషన్లకు అందుబాటులో ఉన్నాయన్నారు.

శిక్షణతో కూడిన ఉపాధి కోర్సులకు దరఖాస్తులు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా ఏలూరు సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్ హోం అప్లయిన్సెస్, అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సుల్లో స్వల్పకాలిక శిక్షణనిచ్చిన అనంతరం ఉపాధి కల్పించేందుకు జూలై 5లోగా అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవాలని ప్రిన్సిపాల్ రజిత ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో ఒప్పందం చేసుకున్నామన్నారు. పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఖాళీగావున్న 45 ఏళ్ల వయస్సులోపు అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు సెల్ 89785 24022 నంబరులో సంప్రదించాలన్నారు.

ఇన్‌సర్వీస్ కోర్సుగా బీపీఈడీకి అనుమతించాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 28 :మున్సిపల్ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులను బీపీఈడీ కోర్సును ఇన్‌సర్వీస్ కోర్సుగా పూర్తిచేసేందుకు అనుమతించాలని శుక్రవారం ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఫిజికల్ డైరెక్టర్ల సదస్సులో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి మున్సిపల్ పాఠశాలల్లో పీఈటీలను నియమించాలని, జీవో 117 ఉత్తర్వులను రద్దుచేసి, ప్రాథమిక తరగతుల విలీనాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సంఘ నాయకులు మాధవీలత, జోజిబాబు, ప్రసన్న, సురేష్, మురళీకృష్ణ, లీలాకుమారి పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు అస్వస్తత

» పొగాకు తోటలో పురుగుల మందులే కారణం..
» జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో వైద్యం.. నిలకడగా పరిస్థితి

బుట్టాయగూడెం, జూన్ 28 : పొట్ట చేతపట్టుకుని కూలీ పనుల కోసం ఏజెన్సీకి వచ్చిన కొందరు వ్యవసాయ కూలీలు గురువారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తోటి కూలీలు, కుటుంబ సభ్యులు వారిని తొలుత బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి శుక్రవారం తరలించారు. ప్రస్తుతం కూలీల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ళ మునిసిపాలిటీ మాచవరం మండలం కొత్తపాలెంకు చెందిన పలు కుటుంబాలకు చెందిన వ్యవసాయ కూలీలు వర్జీనియా పొగాకు పనుల కోసం బుట్టాయగూడెం మండలం దొరమామిడికి మద్దిపాటి రాము, మద్దిపాటి మాణిక్యాలరావు వద్దకు వచ్చారు. గురువారం పొగాకు తోటలో వర్షంలోనే ఆకు కొట్టారు. సాయంత్రం ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకునే సమయంలో 15 మంది వరకు వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. డయేరియా ఏమోనని భయపడగా పొగాకు తోటలకు వాడిన పురుగు మందుల గాటు వల్ల అస్వస్థతకు గురయ్యారని ప్రాణాపాయం ఏమి లేదని వైద్యులు చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీలు

కుల ధ్రువీకరణ పత్రాల జారీపై పునరాలోచించాలి

ఏలూరు రూరల్/భీమవరంటౌన్, జూన్ 28: సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వీఆర్వో లాగిన్‌లో సరైన డేటా పంపకుం డా కేవలం పేర్లు ఉండడంతో పాటు చనిపోయిన వారు, ఇతర గ్రామాల వారు ఈ డేటాలోకి వచ్చారన్నారు. సుమోటో కుల ధ్రువీకరణ వల్ల ఎవరికి ఉపయోగమో ఒకసారి ఆలోచించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు విద్యార్థులకు, ఇతర పథకాలకు అవసరం ఉంటే చేయొచ్చు. కాని ఎవరూ అడగకుండా 60, 70 ఏళ్ల ఉన్నవారికి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం సరికాదన్నారు. సరైన సమాచారం లేకుండా ఏవిధంగా చేయాలని, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికా రులు దీనిపై ఒత్తిడి చేయడం సరికాదని ఆయన ఆయన అన్నారు. ఒకటో తేదీన ఇచ్చే పింఛన్ల విషయంలో సచివాలయ సిబ్బంది ఇవ్వాల్సిన పెన్షన్ల బాధ్యత కూడా వీఆర్వోలకు చెబుతున్నారని.. ఆ పనిచేయటానికి తాము సిద్ధంగా ఉన్నామని, కాని ఓవైపు రెవెన్యూకు సంబంధించి లక్ష్యాలు విధించడం, మరోవైపు ఇతర పనులు చేయాలనడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అవసరం లేని వారికి కులధ్రువీకరణ పత్రాలు అందించాలని కిందిస్థాయి అధికారులను ఒత్తిడి చేయవద్దని అధికారులు సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.